

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

సంపుటి:-01, సంచిక:-136, మంగళవారం 13-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు


ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది.ప్రత్యర్థి వెస్టిండీస్ ముందుకు 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీతో చెలరేగగా, మిగతా బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేయగలిగింది.



అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ (69) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో బలమైన పునాది వేశాడు. విండీస్ బౌలర్లను నలువైపులా బాదుతూ వేగవంతమైన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో అత్యంత వేగంగా 2000 పరుగులని కూడా పూర్తి చేసుకున్నాడు అభిషేక్, మరోవైపు, మిడిల్ ఆర్డర్లో ఇషాన్ కిషన్ (37), తిలక్ వర్మ (28), ఆల్ రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) లు వేగంగా పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అయితే, సంజు శాంసన్ (3), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1), నమన్ ధీర్ (10)లు తక్కువ పరుగులకే అవుటై నిరాశపరిచారు.

ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్‌స్కీ

- పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనమే కారణమని స్పష్టం చేసిన జెలెన్‌స్కీ
- రష్యా దాడులు ఆపితే ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేస్తామంటూ ప్రతిపాదన
- ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఎనర్జీ కాల్పుల విరమణ'పై ఆశ్చర్యం వ్యక్తం చేసిన జెలెన్‌స్కీ
- 60 రోజుల కాల్పుల విరమణ ఇస్తే ఎన్నికలు నిర్వహిస్తామని మరో ఆఫర్



అమెరికాలో ఇంధన ధరల పెరుగుదలకు ఉక్రెయినే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆ దేశ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ

చెన్నై ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన సీఎం విజయ్

చెన్నై: తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చెన్నై విమానాశ్రయంలో సీఎం సి. జోసెఫ్ విజయ్ ఘన స్వాగతం పలికారు.



ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకున్న ప్రధాని మోదీకి గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, సీఎం విజయ్‌తో పాటు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, బీజేపీ నేత నైనార్ నాగేంద్రన్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి పొరూర్ మెట్రో స్టేషన్ వరకు ప్రధాని రోడ్ షో నిర్వహించారు. అనంతరం సీఎం విజయ్ తో కలిసి పూనమల్లి - వడపళని మధ్య నూతనంగా నిర్మించిన చెన్నై మెట్రో ఫేజ్-2 ను ప్రారంభించి, ఇద్దరూ కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ ప్రాజెక్టుల విలువ దాదాపు రూ.13,000 కోట్లు. - మిగతా 2 లో

ఇండియా కూటమి మహాధర్నాలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళుతున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు



ఢిల్లీకి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు పొన్నం ప్రభాకర్ అడ్లూరు లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పయనం ! ఓటరు సవరణ ప్రక్రియ లో జరుగుతున్న అక్రమాలు ,జజుజ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేపు ఇండియా కూటమి మహాధర్నా లో పాల్గొననున్న తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం!

క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్!



ఐటీసీ గ్లోబల్ పేరుతో పెట్టుబడుల మోసం.. రూ.10 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు అనుమానం.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

రేవంత్ సంచలన ఆరోపణ

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్స్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే

'ఓట్ల చోరీ'ని ఆపాలి



- రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'భయపడకుండా రండి
- ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయనున్న విపక్షాలు
- సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించాలని రాహుల్ గాంధీ పిలుపు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాసినట్లు తెలిపిన ఖర్గే
- శాంతియుత నిరసనకారులపై దాడులు జరిగాయని రాహుల్ ఆరోపణ

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న - మిగతా 2 లో

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

- విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం
- ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతూ లేఖ
- దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు
- ఈ ఉత్సవాలు పర్యాటకానికి కొత్త ఊపునిస్తాయని మోదీ ప్రశంస
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని


ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి



- ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి
- ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పే అర్హత కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- తెలంగాణకు వచ్చి చూడాలంటూ రాహుల్ గాంధీకి సవాల్
- బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ
- దేశంలో అశాంతికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్య

నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, - మిగతా 2 లో


పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు



- రియాద్ ఎయిర్‌పోర్ట్ ఘటనపై భారత్ ఘాటు స్పందన
- రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడిని తీవ్రంగా ఖండించిన భారత్
- ఈ దాడిలో 12 మంది మృతి.. 300 మందికి పైగా గాయాలు
- పౌరుల లక్ష్యంగా దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదన్న భారత విదేశాంగ శాఖ
- సౌదీ ప్రభుత్వానికి, ప్రజలకు సంఘీభావం - మిగతా 2 లో

పత్రికా స్వేచ్ఛపై దాడి


- జర్నలిస్టులపై విరుచుకుపడిన పోలీసులు
- ఢిల్లీ నిరసనల ఘటనలపై ?పలు జర్నలిస్టు సంఘాల ఆగ్రహం
- ప్రెస్ కార్డులు చూపించినా అదుపులోకి తీసుకున్నారు
- ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని ఆరోపణలు
- మహిళా జర్నలిస్టుల లైంగికదాడి ఆరోపణలపైనా చర్యలు తీసుకోవాలి: ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్



దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై పోలీసులు, భద్రతా బలగాలు వ్యవహరించిన తీరుపై పలు జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రెస్ కార్డులు చూపించినప్పటికీ పలువురు విలేకరులను అదుపులోకి తీసుకోవడం, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల ఫోన్లను స్వాధీనం చేసుకోవడం, వారిపై దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాల నిరసనలు
- ఢిల్లీ ఆందోళనల్లో పాల్గొనాలని రాహుల్ గాంధీ నిర్ణయం
- ప్రస్తుతానికి వాయిదా పడిన గోవా పర్యటన
- రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన గోవా పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో

క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్!

మొదటిపేజీ తరువాయి – రెండేళ్లలో పెట్టుబడులు రెట్టింపు అవుతాయని, అధిక లాభాలు వస్తాయని నమ్మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 500 మంది బాధితులను మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ప్యాకేజీలు ప్రవేశపెట్టి, కొత్త సభ్యులను చేర్చిన వారికి 25 శాతం వరకు కమీషన్ ఇస్తామని ఆశ చూపినట్లు గుర్తించారు. జూమ్ మీటింగ్‌లు, హోటళ్లలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను ఆకర్షించారు. ఆదిలాబాద్‌లోనూ పలువురు బాధితులు.. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు లక్షల రూపాయలు పెట్టుబడిగా చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రధాన ఫిర్యాదులో జువ్వక నర్సింలు రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు. ఇతర బాధితుల ఫిర్యాదులు తీసుకొని దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు

మొదటిపేజీ తరువాయి – **చివరి ఓవర్లో ప్రిన్స్ యాదవ్ బాదుడు:** చివర్లో పేసర్ ప్రిన్స్ యాదవ్ (13) బౌండరీ (4,0, 4, 4, 1ఎ, బె)లతో మెరిశాడు. చివరి ఓవర్లో వరుస బౌండరీలతో చెలరేగి జట్టు స్కోరును 223 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

కట్టడి చేసిన కరేబియన్ బౌలర్లు: ఒకానొక దశలో భారత్ భారీ స్కోరు సాధించేలా కనిపించినా.. వెస్టిండీస్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ కట్టడి చేశారు. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, స్ప్రింగర్, షమర్ జోసెఫ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టగా.. కీమో పాల్, గుడాకేష్ మోటీలకు తలో వికెట్ దక్కింది. ఇప్పటికే 1-1తో సమంగా ఉన్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో లీడ్ సాధించాలంటే విండీస్ 224 పరుగులు చేయాల్సి ఉంది.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి – దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

'ఓట్ల చోరీ'ని ఆపాలి

మొదటిపేజీ తరువాయి – ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరపున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు. "భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి – ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

మొదటిపేజీ తరువాయి – ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాళ్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.

పత్రికా స్వేచ్ఛపై దాడి

మొదటిపేజీ తరువాయి – రావడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను, ప్రజల తరపున వార్తలు అందించే మీడియాను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఈనెల 10న ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న సమయంలో జర్నలిస్టులపై ఈ చర్యలు చోటుచేసుకున్నాయి. జంతర్ మంతర్ పరిసరాల్లో పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు పలువురు మీడియా ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్టు పలు కథనాలు వెలువడ్డాయి.జర్నలిస్టుల రక్షణ కోసం పనిచేసే కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) ఈ ఘటనపై స్పందించింది. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులు, మీడియా సిబ్బందిని వెంటనే విడుదల చేయాలనీ, స్వాధీనం చేసుకున్న పరికరాలను తిరిగి ఇవ్వాలనీ, వారిపై భౌతిక దాడులు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఢిల్లీ పోలీసులను కోరింది. నిరసనలు, వాటిని పోలీసులు ఎదుర్కొంటున్న తీరుపై మీడియా ఎలాంటి అడ్డంకుటూ లేకుండా వార్తలు అందించే

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి



మొదటిపేజీ తరువాయి – దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!



మొదటిపేజీ తరువాయి – పాల్గొనేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే వారం ఢిల్లీలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకోవాల్సి ఉన్నందున, గోవా పర్యటనను రీషెడ్యూల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియలోని లోపాలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై విపక్ష కూటమి ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కీలక సమయంలో రాహుల్ గాంధీ ఢిల్లీలోనే ఉండటం వల్ల విపక్షాల ఐక్యత బలపడుతుందని, పోరాటానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దగా క్రియాశీలంగా లేని పలువురు విపక్ష నేతలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి, 2027 గోవా అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనను ఖరారు చేశారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం, ప్రజలతో మమేకం కావడం, సంస్థాగత బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రచించారు. అయితే, రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నేతలు 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ స్థాయి పోరాటానికే ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాహుల్ పర్యటన ఎంతో ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో నిరసనలు ముగిసిన తర్వాత గోవా పర్యటనకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ ప్రణాళిక




మొదటిపేజీ తరువాయి – ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తుచేశారు. **VB-G RAM G** పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంఓ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, డీజీపీ సీవీ ఆనంద్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు

మొదటిపేజీ తరువాయి – సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇలాంటి దాడులు పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గత దశాబ్ద కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా దీనిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతో పాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం. దాడి కారణంగా శనివారం విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాలను దారి మళ్లించారు.

ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్‌స్కీ



మొదటిపేజీ తరువాయి – తీవ్రంగా ఖండించారు. పశ్చిమాసియా సంక్షోభం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వల్లనే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ చేస్తున్న విమర్శలకు జెలెన్‌స్కీ దీటుగా బదులిచ్చారు. "పుతిన్‌ను ఎలా అడ్డుకోవాలో వారికి తెలియదు. బలహీనులపై ఒత్తిడి తీసుకురావడం సులభం కాబట్టి, ఇంధన ధరల పెరుగుదలను ఉక్రెయిన్‌తో ముడిపెట్టి మాట్లాడుతున్నారు" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ చేస్తున్న డ్రోన్ దాడుల కారణంగానే అమెరికాలో డీజిల్ ధరలు పెరుగుతున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఈ దాడుల వల్ల అమెరికా రైతులు, పాడి పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వీటిని నిలిపివేయాలని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జెలెన్‌స్కీ, 'ఇంధన కాల్పుల విరమణ'కు తాము సిద్ధమని ప్రకటించారు. రష్యా గనుక తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తే, తాము కూడా రష్యా ఇంధన కేంద్రాలపై దాడులను ఆపేస్తామని ప్రతిపాదించారు. "మాపై దాడులు ఆపండి, మా పిల్లలను చంపకండి.. అప్పుడు మేము కూడా మీ డీజిల్ కేంద్రాలపై దాడులు నిలిపివేస్తాం. ఇదొక సరైన ఒప్పందం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. గత వారం రోజుల్లోనే రష్యా తమ విద్యుత్ రంగంపై 196 సార్లు, చమురు, గ్యాస్ కేంద్రాలపై 20 సార్లు దాడులు చేసిందని, ఈ ఘటనల్లో 153 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని జెలెన్‌స్కీ వివరించారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో స్పందిస్తూ.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే 'ఇంధన కాల్పుల విరమణ' అమల్లోకి వచ్చింది. దీనికి ఇరు పక్షాలు అంగీకరించాయి" అని పోస్ట్ చేయడం గమనార్హం. అయితే, ఈ ప్రకటన తనకు ఆశ్చర్యం కలిగించిందని, మాస్కో నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో కొత్త అధ్యక్షుడు రావాలన్న ట్రంప్ పిలుపునకు బదులిస్తూ.. 60 రోజుల పాటు సంపూర్ణ కాల్పుల విరమణ ప్రకటిస్తే, దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమని జెలెన్‌స్కీ మరో ప్రతిపాదన చేశారు.

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.6.30 లక్షల బీమా పరిహారం అందజేత

బాధిత కుటుంబానికి చెక్కు అందించిన మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు



చేవెళ్ళ, అక్టోబర్ 12(విజన్ పక్షం): చేవెళ్ళ మండలం జాలగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుడు 'అచ్చిన వెంకటయ్య' ఇటీవల వడదెబ్బతో అకాల మరణం చెందారు. దీంతో ఆయన కుటుంబానికి రూ.6,30,637 బీమా పరిహారం మంజూరైంది. బీమా పరిహార చెక్కును చేవెళ్ళ మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు చేతుల మీదగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవర సమతవెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అనుకోని విపత్కర పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా ఎంతో కీలకమని. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని. బీమా ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందడం కొంతవరకు అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ధర్మీయ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ళ బ్రాంచ్ మేనేజర్ ఎస్. హనుమంత్, సీనియర్ డీజీఎం నరేందర్, ఏజీఎం శ్రీనివాస్, బీడీఎం ఎం. హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది కె. రమేష్, పి. వెంకటేష్, సి. సరిత, సి. కుమార్, బి. మాణిక్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

శంకర్పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా

బొల్లారం వెంకటరెడ్డి ప్రమాణస్వీకారం





శంకర్పల్లి, అక్టోబర్ 12 (విజన్ పక్షం): శంకర్పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బొల్లారం వెంకటరెడ్డి మరియు మరో 12 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) నూతన చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించినందుకు జిల్లా మంత్రి శ్రీధర్ బాబు మరియు ఎమ్మెల్యే కాలే యాదయ్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పాలకవర్గం ఎల్లప్పుడూ రైతుల సంక్షేమం కోసమే కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శంకర్పల్లి మండల నాయకులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్స్,వివిధ గ్రామల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించమని ప్రజావాణిలో వినతులు



కుత్బుల్లాపూర్,అక్టోబర్12(విజన్ పక్షం): గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సాయి,కస్తూరి బాలరాజు జోనల్ కమిషనర్ కి డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజీ సమస్యల పరిష్కారం,రహదారుల అభివృద్ధి,పార్కుల పరిరక్షణ మొదలగు అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పనులను

ప్రతిపాదించిన అభివృద్ధి పనులు: మహదేవపురం ఎస్ బ్లాక్, ఎక్స్ బ్లాక్,జె బ్లాక్‌లలో డ్రైనేజీ లైన్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ నీటి సరఫరా పైప్‌లైన్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మల్లారెడ్డి నగర్ ఫేజ్-1లో డ్రైనేజీ లైన్ల తో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులు. మహదేవపురం మాంట్రిడ్జ్ పాఠశాల సమీపంలోని పార్కు వెనుక భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చెయ్యాలని,దోమల నివారణ చర్యలు తీసుకుని ఫాగ్గింగ్ క్రమం తప్పకుండా చేసేలా చూడాలని వినతి పత్రాన్ని అందజేసారు..

దుండిగల్ కేవీఆర్ వ్యాలీలో రూ.46 లక్షల సీఎంసీ నిధులతో సీసీ రోడ్డు మంజూరు

పనులకు శంకుస్థాపన చేసిన కొలను



దుండిగల్,అక్టోబర్12(విజన్ పక్షం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ కేవీఆర్వ్యాలీ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతో సమస్యను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురావెళ్లారు. స్పందించిన ఆయన ప్రత్యేక చొరవతో సీఎంసీ నిధుల నుంచి సుమారు రూ.46 లక్షలు మంజూరు చేయించి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.సంగొల్ల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు, దుండిగల్ డివిజన్‌లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రాంత సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్,కొలన్ జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్,నిజాంపేట్ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బోట్ల విజయ్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసరి మహేందర్ రెడ్డి,మనోజ్, సురేష్, లక్ష్మారెడ్డి, గురువారెడ్డి,మనోహర్, గోపాల్ పద్మారావు, ఆకుల ప్రేమ్ కుమార్, మల్లంపేట్ ప్రకాష్,రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో దుర్గామాత ఉత్సవాలపై శాంతి కమిటీ సమావేశం

అక్టోబర్ 12 (విజన్ పక్షం) షాద్నగర్: అనుమతులు తప్పనిసరి.. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు ? ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలి

షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 40 మంది ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన, మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. విద్యుత్ సదుపాయాలు, ఊరేగింపులు, ఇతర ఉత్సవ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీపీ సూచించారు. అన్ని మతాల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ మత సామరస్యాన్ని, పరస్పర సోదరభావాన్ని కాపాడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకూడదని స్పష్టం చేశారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసుల సూచనల మేరకు వ్యవహరించాలని తెలిపారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను క్రమశిక్షణతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించి షాద్‌నగర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్ గా కుత్బుల్లాపూర్ చౌరస్తా ను తీర్చిదిద్దండి



అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ తో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రోడ్ల విస్తరణ,సీఎంసీ లో విలీనమైన శివారు ప్రాంత మున్సిపాలిటీలలో పారిశుధ్య నిర్వహణ, అస్తవ్యస్తంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ వంటి అంశాలపై చర్చించారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాను ట్రాఫిక్ ఫ్రీ చౌరస్తాగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలన్నారు.అదేవిధంగా కొత్తగా ఏర్పాటైన సిఎంసి కార్పొరేషన్ లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ సివరెజ్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ప్రణాళిక బద్ధంగా శివారు సర్కిల్స్ పరిధిలో మౌలిక వసతులను చేపట్టి కొంపల్లి, నిజాంపేట్,దుండిగల్ సర్కిల్ ల లోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరచే విధంగా కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చెయ్యాలన్నారు.నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలన్నారు. చెత్త ఎక్కడికక్కడ కుప్పలుగా పెరుకుపోతోంది రహదారుల్లోనూ అదే పరిస్థితి ఏర్పడి దుర్గంధం వెదజల్లుతుంది. దానిపై సత్వర చర్యలు తీసుకుని చెత్త వెయ్యడాన్ని అరికట్టలన్నారు.కార్యక్రమంలో ఉప కమీషనర్ శంకర్ సింగ్,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను చాటాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

రాష్ట్ర స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి

ఆకట్టుకున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల లేజర్ షో



కోటబొమ్మాళి, **అక్టోబర్ 12 (విజన్ పక్షం):** క్రీడాకారులు తమలోని ప్రతిభను వెలికితీసుకుంటూ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకర్షించారు. సోమవారం కోటబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

101వ కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర స్థాయి అధికారిక పండుగగా నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామీణ కబడ్డీ పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వరుసగా మూడోసారి ఈ ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం విశేషం. పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలు యువతలో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరిస్తూ స్నేహభావం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

పోటీల్లో భాగంగా శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం జట్టు, కడప పురుషుల జట్టు మధ్య జరిగిన తొలి మ్యాచ్‌ను మంత్రి టాస్ వేసి ప్రారంభించారు. ఇరు జట్ల క్రీడాకారులు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు క్రీడాభిమానులు పోటీలను ఆసక్తిగా తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడాకారుల ప్రతిభ, పోటీల్లో నెలకొన్న ఉత్సాహం ప్రేక్షకుల్లో కేరింతలు నింపాయి. పురుషులు, బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు జరిగాయి.



ఆకట్టుకున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల లేజర్ షో

కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్తమ్మతల్లి ఉత్సవాల కార్యక్రమాలు, ఆలయ విశేషాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన లేజర్ షో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

కోటబొమ్మాళి మండలంలోని సీతన్నపేట నుంచి దుర్గంపేట వరకు సుమారు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను మెరుగుపరచి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించే దిశగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కోటబొమ్మాళి పి ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మి, కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయిన గోవింద రాజులు, వ్యాయామ ఉపాధ్యాయులు, రెఫరీలు, తదితరులు, పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా కూటమి ప్రభుత్వం:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడలో 75 బాధిత కుటుంబాలకు రూ.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాము

సీఎం చంద్రబాబు చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా భారీగా ఆర్థిక సహాయం:ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వం వచ్చాక గుడివాడ నియోజకవర్గంలో రూ.8.40 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ...







అక్టోబర్ 12 (విజన్ పక్షం): ప్రజల కోసం, రాష్ట్రం కోసం కష్టాన్ని కూడా ఇష్టంగా భరిస్తున్న... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రజలందరూ మద్దతుగా నిలవాలి గుడివాడ అక్టోబర్ 12:ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా బాధిత కుటుంబాలకు పెద్దఎత్తున ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. గుడివాడలోని ప్రజా వేదిక కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నియోజకవర్గ పరిధిలోని 75 మంది బాధిత కుటుంబాలకు రూ.60 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలు ఒకవైపు, వైద్య చికిత్సల ఖర్చులు మరోవైపు పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, వారి కష్టాల్లో భాగస్వాములుగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని కల్పించడం ఎంతో ముఖ్యమని, సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు మానసిక ధైర్యాన్ని కూడా అందిస్తున్నాయని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స ఖర్చులను భరించలేక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తగిన స్థాయిలో సహాయం అందలేదని విమర్శించిన ఎమ్మెల్యే రాము, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుడివాడ నియోజకవర్గంలోనే ఇప్పటివరకు రూ.8.40 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇది బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం, వారి కుటుంబాలకు కలుగుతున్న ఊరట తనకు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయని రాము తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు తమకు అందిన సహాయం గురించి ఇతరులకు కూడా తెలియజేయాలని, తద్వారా వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న మరికొంతమంది బాధితులకు ఈ పథకంపై అవగాహన కలిగి ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో భరోసా నింపేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు,గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పండ్రాజు సాంబశివరావు, వాసే మురళి,దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకటరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు,లింగం ప్రసాద్,వసంతవాడ దుర్గారావు, ముల్లపూడి రమేష్ చౌదరి, నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల టిడిపి నాయకులు, ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. లుక్ తో అసంతృప్తి అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మే లో కొత్త షెడ్యూల్ కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్ 2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్డ్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్

చీరకట్టులో సాంప్రదాయంగా కనిపిస్తున్న మానస వారణాసి!



అలాంటి వారిలో ప్రముఖ యంగ్ బ్యూటీ మానస వారణాసి కూడా ఒకరు. ఈ మధ్యకాలంలో తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ చిన్నది..

సోషల్ మీడియాలో కొంతమంది హీరోయిన్స్ గ్లామర్ తో ఆకట్టుకుంటే.. మరికొంతమంది సాంప్రదాయంగా కనిపించి మెస్మరైజ్ చేస్తున్నారు. అలాంటి వారిలో ప్రముఖ యంగ్ బ్యూటీ మానస వారణాసి కూడా ఒకరు. ఈ మధ్యకాలంలో తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ చిన్నది.. తాజాగా చీర కట్టులో కనిపించి అభిమానులను మెస్మరైజ్ చేసింది. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన గ్రీన్ అండ్ స్కై బ్లూ కలర్ మిక్స్ శారీ కట్టిన ఈమె బ్లౌజ్ పై గోల్డెన్ కలర్ తో హెవీ ఎంబ్రాయిడరీ డిజైన్ చేశారు. ఇక నెక్ ను ఫుల్ ఫిల్ చేయడానికి డైమండ్స్ తో అందంగా డిజైన్ చేసిన నెక్లెస్ ధరించిన ఈమె.. దీనికి మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ ధరించి ఆకట్టుకుంది. నెక్లెస్ కి మ్యాచింగ్ గా డైమండ్స్ పొదిగిన బ్యాంగిల్స్ ధరించిన మానస.. తన అందాన్ని మరింత ఫుల్ ఫిల్ చేసుకుంది. జుట్టును వేవింగ్ చేసి వదిలేసిన మానస వారణాసి లుక్స్ చూసి అభిమానులు పర్ఫెక్ట్ లుక్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరి కొంతమంది ఆక్స్ఫర్డ్ డిక్షనరీ లో ఒక కొత్త అడిషన్ ఈ ముద్దుగుమ్మ అంటూ కామెంట్ చేయడం గమనార్హం . ముఖ్యంగా మానస వారణాసి లుక్ చూసి అభిమానులు తెగ కామెంట్లు పెట్టేస్తున్నారు.. గార్జియస్ అని కామెంట్ చేస్తుంటే.. మరొకరు ప్రతి వ్యక్తి జీవితంలో మిత్ర లాంటి అమ్మాయి తోడు కావాలి అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా మానస వారణాసి తాజాగా షేర్ చేసిన ఈ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణకు చెందిన మానస మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టి ..అందాల పోటీలలో విజేతగా నిలిచింది. 2020 మిస్ ఇండియా అందాల పోటీలలో కిరీటాన్ని అందుకున్న మానస వారణాసి.. 2021 మిస్ వరల్డ్ పోటీలలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన మానస ఫ్యాక్ట్ సెట్ లో ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ఎక్స్టెండ్ విశ్లేషకురాలిగా కూడా పనిచేసింది ఫెమినా మిస్ తెలంగాణ 2019 అందాల పోటీలలో టాప్ త్రీ లో నిలిచిన మానస వారణాసి , ఫెమినా మిస్ ఇండియా 2020లో కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఇకపోతే 2024లో దేవకీ నందన వాసుదేవా సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఇటీవల సంతోష్ శోభన్ తో కలిసి కపుల్ ఫ్రెండ్లీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యువి కాన్సెప్ట్స్ బ్యానర్ పై అజయ్ కుమార్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అశ్విని చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. ఇకపోతే సంతోష్ శోభన్, మానస వారణాసి జంటకు అభిమానులు ఫిదా అయిపోయారు. పైగా ఈ జంట కాంబినేషన్లో మరో సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 14కి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏది ఏమైనా మానసా వారణాసి అటు సినిమాలతో ఇటు అందాలతో అభిమానులను ఆకట్టుకుంటుంది.



శర్వా 'బైకర్'.. ఇంకా ఎంత రావాలి?



యంగ్ హీరో శర్వానంద్ లీడ్ లో రూపొందిన తాజా చిత్రం బైకర్.. స్టేబుల్ రన్ తో కొనసాగుతోంది. బైక్ రేసింగ్ నేపథ్యంతో యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లర్ అంశాలతో తెరకెక్కిన ఆ సినిమా ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలకు ముందు మంచి హైప్ సాధించినప్పటికీ, తొలి మూడు రోజుల కలెక్షన్లు చూసిన ట్రేడ్ పండితులు మాత్రం ఆ చిత్రానికి ఇంకా చాలా దూరం ప్రయాణం మిగిలి ఉందని అంచనా వేస్తున్నారు. సినిమాలో శర్వానంద్ తో పాటు యాంగ్రీ స్టార్ డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించగా, మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించింది. అలాగే బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి వంటి నటులు ప్రధాన పాత్రలు పోషించారు. యువ దర్శకుడు అభిలాష్ రెడ్డి ఆ సినిమాతో దర్శకుడిగా తన ప్రతిభను చూపించేందుకు ప్రయత్నించారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై విక్రమ్ రెడ్డి, వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ నిర్మించారు. ఇది సామాజిక మార్పుకు ఒక దిక్సూచి ూాఒజవతీఅంవఎవత్ సాంకేతికంగా బైకర్ మంచి రేంజ్ లో రూపొందిందని చెప్పాలి. జిబ్రాన్ అందించిన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలం. యువరాజ్ సినిమాటోగ్రఫీ బైక్ రేసింగ్ సన్నివేశాలు ఆకట్టుకునేలా తెరకెక్కించగా, అనిల్ పసాల ఎడిటింగ్, పన్నీర్ సెల్వం ఆర్ట్ వర్క్ కథకు అనుగుణంగా ఉన్నాయి. ముఖ్యంగా చిత్రాన్ని 3డీ, 4డీ ఎక్స్, డాల్బీ విజన్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల చేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఇక బడ్జెట్ విషయానికి వస్తే, బైకర్ సుమారు రూ.45 కోట్లతో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియేట్రికల్ హక్కుల్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు సుమారు రూ.23 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఓవర్సీస్, కర్ణాటక, ఇతర ప్రాంతాల హక్కులతో కలిపి ఆ సినిమా థియేట్రికల్ బిజినెస్ సుమారు రూ.30 కోట్ల వరకు పూర్తయిందని వినికిడి. దీంతో సినిమా వరల్డ్ వైడ్ గా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే కనీసం రూ.31 కోట్ల షేర్ వసూలు చేయాల్సిన అవసరం ఉంది. అయితే విడుదలైన తొలి మూడు రోజుల్లో బైకర్ సుమారు రూ.18 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇది దాదాపు రూ.9 కోట్ల షేర్ కు సమానం. అంటే బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను చేరుకోవాలంటే ఇంకా రూ.22 కోట్లకు పైగా షేర్ రాబట్టాల్సి ఉందని సమాచారం. ఇది సాధించాలంటే వచ్చే రోజుల్లో కలెక్షన్లు బాగా పెరగాల్సిన పరిస్థితి ఉంది. మొత్తంగా చూస్తే.. మంచి కాన్సెప్ట్, సాంకేతిక విలువలు ఉన్నప్పటికీ బైకర్ బాక్సాఫీస్ వద్ద ఇంకా వేగం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వర్కింగ్ డేస్ లో కలెక్షన్లు ఎలా ఉంటాయన్నది కీలకం. ప్రేక్షకుల నుంచి మరింత మౌత్ టాక్ వస్తే రికవరీ దిశగా అడుగులు వేయగలదని చెప్పాలి. ప్రస్తుతం పరిస్థితులు చూస్తే బైకర్ బ్రేక్ ఈవెన్ చేరుకోవడం కోసం ఇంకా చాలా దూరం వెళ్లాల్సిందే.

హైదరాబాద్ పై బాలీవుడ్ ఫోకస్.. ఆ టీజర్ తో ఫుల్ క్లియర్..

ఆ చిత్రానికి మరో మెయిన్ అట్రాక్షన్ హైదరాబాద్ లొకేషన్లు. నగరంలోని దుర్గం చెరువు, హుస్సేన్ సాగర్, అలాగే నిఫ్ట్ క్యాంపస్ వంటి ప్లేసెస్ ను అందంగా చూపించారు.



బాలీవుడ్ సినిమాల దృష్టి మళ్లీ హైదరాబాద్ వైపు మళ్లుతుందని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. వాటికి ఇప్పుడు పెర్ఫెక్ట్ ఉదాహరణగా నిలుస్తోంది చాంద్ మేరా దిల్ చిత్రం. బీటౌన్ యంగ్ హీరో లక్ష్య, క్రేజీ బ్యూటీ అనన్య పాండే జంటగా నటిస్తున్న ఆ సినిమా తాజాగా విడుదలైన టీజర్ తోనే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆ సినిమా హైదరాబాద్ నేపథ్యంతో తెరకెక్కడం విశేషంగా మారింది. ఇటీవల విడుదలైన టీజర్ ను గమనిస్తే.. ప్యూర్ క్యాంపస్ లవ్ స్టోరీగా తెలుస్తోంది. ఇంజనీరింగ్ కాలేజీ నేపథ్యంలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలయ్యే ప్రేమ కథ చుట్టూ సినిమా తిరుగుతుందని అర్థమవుతోంది. మొదట్లో సరదాగా సాగిపోయే ఆ ప్రేమ, ఆ తర్వాత జీవితంలో ఎదురయ్యే అనుకోని మలుపులు, భావోద్వేగ సంఘటనలతో మరింతగా డీప్ గా మారుతుందని టీజర్ సూచిస్తోంది. ఆ చిత్రానికి మరో మెయిన్ అట్రాక్షన్ హైదరాబాద్ లొకేషన్లు. నగరంలోని దుర్గం చెరువు, హుస్సేన్ సాగర్, అలాగే నిఫ్ట్ క్యాంపస్ వంటి ప్లేసెస్ ను అందంగా చూపించారు. ఆ లొకేషన్లు సినిమాకు స్పెషల్ విజువల్ ఫీల్ ను తీసుకురావడమే కాకుండా, తెలుగు ప్రేక్షకులకు దగ్గరగా అనిపించేలా చేస్తున్నాయి. హైదరాబాద్ నగర అందాలు బాలీవుడ్ మళ్ళీ తెరపైకి తీసుకురావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవలి కాలంలో బాలీవుడ్ సినిమాలు హైదరాబాద్ లో షూటింగ్ జరపడం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. మంచి ఇన్ ఫ్రాస్ట్రక్చర్, విభిన్నమైన లొకేషన్లతోపాటు సౌకర్యవంతమైన షూటింగ్ వాతావరణం కారణంగా నిర్మాతలు హైదరాబాద్ ను ఎక్కువగా ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. చాంద్ మేరా దిల్ కూడా ట్రెండ్ ను కొనసాగిస్తున్న చిత్రం అని చెప్పవచ్చు. అయితే మ్యూజిక్ పరంగా కూడా సినిమా స్ట్రాంగ్ గా ఉండబోతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. సచిన్- జిగర్ అందించిన మ్యూజిక్ ఆ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉంది. టీజర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఎమోషన్స్ ను బాగా హైలైట్ చేస్తోంది. అసలు ఆ సినిమా ఏప్రిల్ లోనే విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు మే 22న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే టీజర్ తో మంచి బజ్ సృష్టించిన ఆ చిత్రం, విడుదలకు దగ్గర పడే కొద్దీ మరింత హైప్ తెచ్చుకునే అవకాశం ఉంది. మొత్తానికి చాంద్ మేరా దిల్ టీజర్ చూస్తే ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, భావోద్వేగాలతో నిండిన యూత్ ఫుల్ డ్రామా అని అర్థమవుతోంది. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్, కొత్త జంట కెమిస్ట్రీ, సంగీతం.. అన్నీ కలిపి ఆ సినిమాను ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూసేలా చేస్తున్నాయి. మరి మే 22న రానున్న చాంద్ మేరా దిల్ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

శేష్ 'డెకాయిట్'.. సూపర్ ఛాన్స్ ను క్యాష్ చేసుకుంటుందా?



టాలీవుడ్ లో తనదైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అడివి శేష్ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ నటించిన చిత్రం డెకాయిట్. లవ్, ఫ్యామిలీ, యాక్షన్, రొమాంటిక్ అంశాలతో తెరకెక్కిన ఆ సినిమా ఏప్రిల్ 10న సమ్మర్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే ఆ మూవీకి సంబంధించిన టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి రేపాయి. ముఖ్యంగా అడివి శేష్ స్టైల్ యాక్షన్, మృణాల్ ఠాకూర్ ప్రెజెన్స్ సినిమాపై అంచనాలు పెంచేశాయి. సోషల్ మీడియాలో కూడా డెకాయిట్ పై మంచి బజ్ ఉన్నట్లు కనిపిస్తోంది. ట్రైలర్ లో కనిపించిన ఎమోషనల్, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. మొదటి రోజుకు సంబంధించిన టికెట్ల అమ్మకాలు కూడా బాగానే జరుగుతున్నట్లు సమాచారం. ఇది సినిమాపై ఉన్న ఆసక్తిని స్పష్టంగా చూపిస్తోంది. సమ్మర్ సీజన్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ కూడా థియేటర్లకు రావడానికి ఆసక్తి చూపించే అవకాశం ఉంది. ఇక ఈ వారం డెకాయిట్ కు బాక్సాఫీస్ వద్ద మంచి అవకాశం కనిపిస్తోంది. గత వారం విడుదలైన బైకర్, రాకాస చిత్రాలు డీసెంట్ టాక్ తో నడుస్తున్నప్పటికీ, అవి భారీ కలెక్షన్లు రాబట్టే స్థాయిలో లేవు. ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న డెకాయిట్ కు మంచి స్పేస్ దొరికినట్టే. అయితే పోటీ పూర్తిగా లేకపోలేదు. డెకాయిట్ తో పాటు లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, పల్లి చట్టంబి సినిమాలు కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే అవి డబ్బింగ్ చిత్రాలు కావడంతో తెలుగు ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటాయో అనేది సందేహంగా ఉంది. కాబట్టి స్ట్రెయిట్ తెలుగు సినిమాగా డెకాయిట్ కు కొంత అదనపు ప్రయోజనం దక్కుతుందనే చెప్పాలి. మొత్తంగా చూస్తే డెకాయిట్ కు ఈ వారం బాక్సాఫీస్ వద్ద మంచి అవకాశం ఉంది. సినిమా కంటెంట్ స్ట్రాంగ్ గా ఉండి, పాజిటివ్ టాక్ వస్తే భారీ వసూళ్లు సాధించే ఛాన్స్ కచ్చితంగా ఉంటుంది. ముఖ్యంగా అడివి శేష్ గత చిత్రాల మాదిరిగానే డెకాయిట్ సినిమా కూడా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో ఉంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. ఇక ఫైనల్ గా డెకాయిట్ హిట్ అవుతుందా లేదా అనేది పూర్తిగా మౌత్ టాక్ పై ఆధారపడి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉన్న బజ్, మార్కెట్ పరిస్థితి చూస్తే మాత్రం ఆ సినిమాకు సూపర్ ఛాన్స్ ఉన్నట్లు క్లియర్ గా కనిపిస్తోంది. ఇప్పుడు ఆ అవకాశాన్ని ఆ మూవీ ఎంతవరకు క్యాష్ చేసుకుంటుందనేది అంత్ష వేచి చూడాలి.

Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980